సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 7 । ఏప్రిల్ । 2023



పాడి పరిశ్రమకు అండగా..

పాడి పరిశ్రమకు ప్రభుత్వం అండగా ఉంటోంది. ఆడదూడల ఉత్పత్తి పథకానికి శ్రీకారం చుడుతోంది.

- 8లో



చందనోత్సవానికి వేళాయె

మదీనా బాబా చందనోత్సవానికి వేళైంది. నేటి నుంచే ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	కనిష్టం	గరిష్టం
ఆమదాలవలస	34°	24°
ఇచ్ఛాపురం	36°	23°
పలాస	33°	25°
టెక్కలి	34°	23°
పాతపట్నం	36°	23°
రణస్థలం	35°	24°
కొత్తూరు	33°	23°
నరసన్నపేట	35°	25°
శ్రీకాకుళం	35°	24°



న్యూస్‌రీల్

పొందూరులో మైనింగ్ విజిలెన్స్ దాడులు

పొందూరు: పొందూరు మండలంలో మైనింగ్ విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు జరిపారు. మైనింగ్ డీడీ ఫణిభూషణ్ రెడ్డి, ఏడీ బాలాజీనాయక్, విజిలెన్స్ ఏడీ వెంకటేశ్వర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, నాగరాజులు దాడులు చేశారు. అనుమతులు లేకుండా చిప్స్, రాళ్లు, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాహనాలను సీజ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

'తక్షణమే అరెస్ట్ చేయాలి'



బాధితులతో మాట్లాడుతున్న దళిత నాయకులు

సంతబొమ్మాళి: మండలంలోని దండుగోపాలపురం గ్రామానికి చెందిన దళితులపై దాడికి పాల్పడిన అరంగి వసంతరావు, విష్ణు, అరుణ్ కుమార్, బాలక ప్రసాద్, బాలక నారాయణరావు, రాములపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్ట్ చేయాలని దళిత నాయకులు కోరారు. ఈ మేరకు బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు. దాడిని సమతా సైనిక్ దళ్ జిల్లా సమన్వయకర్త చల్లా రామారావు, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తల సముద్రం సూర్యం ఖండించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ధ్వంసం చేసి సర్వం కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్, ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీల్లో గురువారం ప్రారంభమయ్యాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు ఈ పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 8, 10, 11, 12, 13, 15 తేదీల్లో జరగనున్నాయి. మొదటి రోజు పరీక్షలు సజావుగా జరగ్గా, శివానీలో మొదటి షిఫ్ట్‌లో 84 మందికి 81 మంది హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 83 కి 77 మంది హాజరు కాగా, ఆరుగు రు గైర్హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వరాలో మొదటి షిఫ్ట్‌లో 100కి 98 మంది హాజరు కాగా, ఇద్దరు గైర్హాజరయ్యారు. రెండో షిఫ్ట్‌లో 100కి 99 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. మొదటి రోజు పరీక్షలు సజావుగా జరిగాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షలు నిర్వహిస్తోంది.

హిందీ పరీక్షకు 194 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయి. మొత్తం 149 కేంద్రాల్లో గురువారం జరిగిన హిందీ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 28,782 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా వివిధ కారణాలతో 194 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ గార పగడాలమ్మ పరీక్షల తీరును పర్యవేక్షిస్తున్నారు. అలాగే పాఠశాల విద్యాశాఖ నియమించిన రాష్ట్ర పరిశీలకులు ఆర్.విజయ్‌కుమార్ పలాస మండలంలోని పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.

ప్రశాంతంగా ఓపెన్‌స్కూల్ పరీక్షలు

జిల్లాలో ఓపెన్ స్కూల్ 10, ఇంటర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 10వ తరగతి పరీక్షలకు 28 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 50 మంది డుమ్మా కొట్టారు.

సీతంపేట ఐటీడీఏ పీఓగా కల్పనాకుమారి



సాక్షి ప్రతినిధి, విజయనగరం: సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.నవ్యకు బదిలీ అయ్యింది. ఉపాధి, శిక్షణా డైరెక్టర్‌గా ఆమెకు పోస్టింగ్ వచ్చింది. ఆమె స్థానంలో 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారి కల్పనాకుమారి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ పనిచేస్తున్నారు.

కూన అండ్ కో..
అందినంత దోచుకో..



ఈ ఫొటో చూడండి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ నడుపుతున్న స్టోన్ క్రషర్. దీనికి మాత్రమే అనుమతి ఉంది. కానీ, దాని ముసుగులో పక్కనున్న వీఆర్ గూడెం కొండను అక్రమంగా తవ్వేసి గ్రావెల్, ఇతర మెటీరియల్‌ను తీసుకుంటున్నారు. వాస్తవానికి అక్కడ గ్రావెల్ ఇతర తవ్వకాలకు ఎలాంటి అనుమతి లేదు. తనకున్న క్రషర్‌కు వేరే చోట నుంచి రాళ్లు తీసుకుని క్రషింగ్ చేయాల్సి ఉంది. ఇక్కడంతా అడ్డగోలుగానే జరుగుతోంది.

- కూన రవి మైనింగ్ లీలలు
- తన స్టోన్ క్రషర్ పక్కనే అక్రమ తవ్వకాలు
- అనుమతుల్లేకుండా కొండను క్వారీగా చేసుకున్న వైనం
- వీఆర్ గూడెం కొండ చుట్టూ అక్రమ క్వారీలు నిర్వహిస్తున్న కూన అండ్‌కో
- కళ్ల ముందే కరిగిపోతున్న 410 ఎకరాల కొండ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వీఆర్ గూడెంలో ఉన్న కొండ చుట్టూ అక్రమ క్వారీలు నడుస్తున్నాయి. అనుమతుల్లేకుండా తవ్వకాలు జరుగుతున్నాయి. నిత్యం వందలాది లారీలతో రాళ్లు, గ్రావెల్ తదితర మెటీరియల్‌ను అమ్ముకుని, రవాణా చేసి కోట్లలో సంపాదిస్తున్నారు. దాదాపు 410 ఎకరాల వరకు వీఆర్ గూడెం కొండ వీరి తవ్వకాలకు ఇప్పటికే చాలా వరకు కరిగిపోయింది. ముందుముందు కొండ మొత్తం కనుమరుగైపోయినా ఆశ్చర్యపోవల్సిన అవసరం లేదు. కూన అండ్ కో అంటే భయమో, లేదా ముడుపుల మహత్యమో గానీ అధికారులు ఈ అక్రమాల జోలికెళ్లడం లేదు.

వాస్తవానికి కూన రవికుమార్ సామదాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తారు. తొలుత ప్రలోభ పెడతారు. దారికొస్తే కుమ్మక్కై అక్రమాలు సాగిస్తారు. మాట వినకపోతే జులుం చూపిస్తారు. ఫోన్‌లు చేసి బెదిరిస్తారు. ఇంకా దారికిరాకపోతే నేరుగా వెళ్లి తనదైన శైలిలో వార్నింగ్ ఇస్తారు. ఇలాంటి పరిణామాలు గతంలో చాలా జరిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కూడా పదుల సంఖ్యలో జరిగాయి. అధికారులను కార్యాలయంలో పెట్టి కొడతామని, చెట్టుకు కట్టి కొడతామని, వాహనాలతో కుమ్మేంచేస్తానని, ఇలా రకరకాలుగా బెదిరించిన దాఖలాలు ఉన్నాయి. బెదిరింపులు, వార్నింగ్‌లకు సంబంధించి ఆడియో టేప్‌లు కూడా బయటకు వచ్చాయి. ఈయన తీరుపై విసుగెత్తి, భరించలేక కొందరు ఉద్యోగులు ఫిర్యాదులు చేసిన సందర్భాలు ఉన్నాయి. మొత్తానికి ఏం చేసి సక్సెస్ అయ్యారో తెలీదు గానీ గత కొన్నేళ్లుగా వీఆర్ గూడెం కొండ చుట్టూ తనతో పాటు మందీ మార్బలం కలిపి అక్రమంగా క్వారీలు నడిపి కొండను కరిగించేసి సొమ్ము చేసుకుంటున్నా ఆ కొండ జోలికి ఏ ఒక్క అధికారి వెళ్లలేదు.

అక్రమంగా తవ్వకాలు చేస్తున్న క్వారీ ఇది. కూన రవికుమార్ అనుచరులు, బినామీలు అక్రమంగా తవ్వకాలు జరిపి కోట్లలో లబ్ధిపొందుతున్నారు. కొన్ని నెలలుగా ఇక్కడ అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు.



కూన రవికుమార్ అండ్ కో నిర్వహిస్తున్న మరో అక్రమ క్వారీ ఇది. ఆయన అనుచర గణం బరితెగించి తవ్వకాలు జరుపుతోంది. నిత్యం లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇక్కడ గ్రావెల్, రాళ్లను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.





ఎట్టకేలకు కదిలిన అధికారులు..

ఇటీవల పత్రికల్లో వరుస కథనాలు రావడం, తాజాగా ఆ అక్రమ క్వారీలో ఒక యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందడంతో మైనింగ్, రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు కదిలారు. సర్వే నంబర్ 137లో కొండను, అక్రమ తవ్వకాలను పరిశీలించారు. కాకపోతే, ఈటీఎస్ మిషన్ లేకపోవడంతో గురువారం సర్వే చేయలేదు. శుక్ర, శనివారాల్లో సర్వేయర్లతో ఎంతమేర తవ్వకాలు జరిపారో గుర్తించి, అక్రమ మైనింగ్‌కు సంబంధించి నోటీసులిచ్చి, క్రిమినల్ కేసులు పెడతామని, రికవరీ కూడా చేస్తామని చెప్పుకొచ్చారు.

పనిలో పనిగా ఆకస్మిక తనిఖీలు

అక్రమ క్వారీలను పరిశీలించేందుకు వచ్చిన సమయంలో పొందూరు–చిలకపాలెం రోడ్డులో అక్రమంగా మైనింగ్ మెటీరియల్‌ను తరలిస్తున్న రెండు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనుమతుల్లేకుండా తరలిస్తున్నట్టుగా గుర్తించి వాటిని పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో మైనింగ్ శాఖ డీడీ ఫణిభూషణ్‌రెడ్డి, మైనింగ్ ఏడీ బాలాజీ నాయక్, విజిలెన్స్ ఏడీ వెంకటేశ్వర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కొడుకును వెతికేందుకు వెళ్లి..

- ఆటో బోల్తా పడి తండ్రి మృతి
- కుమారుడితో పాటు మరో ఇద్దరికి గాయాలు



మృతి చెందిన గంగయ్య

కోటబొమ్మాళి: కొడుకు చిన్నపాటి అలక తండ్రి ప్రాణాలను బలికొంది. చిరుకోపంలో ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారుడిని వెతికేందుకు బయల్దేరిన తండ్రి తిరిగి ఇంటికి మృతదేహమై చేరాడు. రేగులపాడు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కస్తూరిపాడు పంచాయతీ గంగుపేటకు చెందిన కొయ్యాన మోహనరావు గురువారం రాత్రి 10 గంటల సమయంలో అతని భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మోహనరావును వెతికేందుకు తండి కొయ్యాన గంగయ్య(53) గ్రామానికి చెందిన కొర్రాయి కృష్ణారావు, ఆటో డ్రైవర్ రావుల హరిశ్చంద్రలతో కలిసి ఆటోలో బయల్దేరాడు. చల్లపేట వైపు వెళ్లి వెతకగా అక్కడ మోహనరావు కనిపించాడు. కొడుక్కి నచ్చజెప్పి అర్ధరాత్రి సమయంలో అంతా తిరిగి ఇంటికి ప్రయాణమయ్యారు. అయితే రేగులపాడు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి వీరి ఆటో చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో వెనుక కూర్చున్న గంగయ్య మృతి చెందగా, మిగిలిన ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు.

రెవెన్యూ శాఖలో పాత వాహనాల వేలం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని రెవెన్యూ విభాగంలో కాల పరిమితి ముగిసిన తొమ్మిది వాహనాలను ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం, రవాణా శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఫర్మ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా వివరాలు నమోదు చేసుకుని, దరఖాస్తు కోసం రూ.1,000 డిమాండ్ డ్రాఫ్ట్‌ను కలెక్టర్, శ్రీకాకుళం పేరున చెల్లించి, 21న జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు. పాట అనంతరం డబ్బును మూడు రోజుల్లోగా చెల్లించి, వాహనాలను ఐదు రోజుల్లో తీసుకుని వెళ్లాలని తెలిపారు.

పోర్టు శంకుస్థాపనకు సన్నద్ధం

- మంత్రి సీదిరి అప్పలరాజు



పలాస క్యాంప్ కార్యాలయంలో పోర్టు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: భావనపాడు పోర్టుకి సంబంధించి పర్యావరణ అనుమతులు పూర్తి కానున్నాయని, అన్నీ సవ్యంగా జరిగితే ఈ నెల మూడో వారంలో పోర్టు శంకుస్థాపన జరుగుతుందని, ఆ కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా వస్తారని మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. దీని కోసం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ఏపీ ఎంబీఎండీ, ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ టీఎస్ఎన్ మూర్తి, విశ్వ సముద్ర ఎండీ జయచంద్ర, సుధీర్ ముందస్తు ఏర్పాట్లకు సంబంధించిన సూచనల కోసం గురువారం రాత్రి మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి చర్చించారు. అనంతరం పోర్టు నిర్మాణానికి సంబంధించిన అనేక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ల్యాండ్ ఎక్విజేషన్, ఆర్ఎండ్‌ఆర్‌కాలనీ నిర్మాణానికి కావాల్సిన ల్యాండ్ ఎక్విజేషన్ కూడా మూడో వారం లోనే పూర్తి చేస్తామని, వీటన్నిటి పనులకు సైతం శంకుస్థాపనకు సిద్ధం చేయాలని మంత్రి డాక్టర్ సీదిరి సూచించారు.

ఎకరాకు రూ. 25 లక్షలు

- నౌపడ గ్రామసభలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి



నౌపడ గ్రామ సభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

సంతబొమ్మాళి: భావనపాడు పోర్టు అనుసంధాన రోడ్డుకు భూములు ఇచ్చే రైతులకు ఎకరాకు రూ.25 లక్షలు పరిహారాన్ని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. పోర్టు నిర్మాణ ప్రాంతం నుంచి 16వ జాతీయ రహదారిని అనుసంధానించే స్పీడ్ యాక్సిస్ రోడ్డు భూసేకరణ కోసం గురువారం నౌపడ సచివాలయంలో పోర్టు డిప్యూటీ కలెక్టర్ అంబ్లిష్ ఆధ్వర్యంలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ప్రభుత్వ ధర రెండింతలు చేసి రూ.22.50 లక్షలు ఇస్తామని సబ్ కలెక్టర్ ప్రకటించారు. దీన్ని తిరస్కరించిన రైతులు ఎకరాకు రూ.40 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. చివరకు ఎకరా భూమికి రూ.25 లక్షలు చొప్పున చెల్లిస్తామని స్పష్టం చేశారు. దీంతో రైతులు అంగీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చలమయ్య, ఆర్‌ఐ చంద్రమౌళి, సర్వేయర్ బాలరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ పిలక రవికుమార్‌రెడ్డి, లోపింటి రాములు, బత్సల సుధాకర్, మూలపేట సర్పంచ్ బాబురావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చేసిన మేలును చెప్పేందుకు..



కొత్తూరులో 'మా నమ్మకం నువ్వే జగన్' వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- నేటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్' పేరుతో ప్రజల్లోకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 'మా నమ్మకం నువ్వే జగన్' నినాదంతో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక కార్యక్రమం
- వైఎస్ జగన్, చంద్రబాబు ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ కరపత్రాలతో ప్రచారం
- ప్రజాభిప్రాయాన్ని తెలుసుకుని స్టిక్కర్లు అందజేయనున్న గృహ సారథులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోంది. కుల, మత, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా లబ్ధిదారులకు సంక్షేమ పథకాల నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తోంది. మధ్యవర్తులు, అవినీతికి తావులేకుండా సంక్షేమ ఫలాలను అందిస్తోంది. అదే టీడీపీ హయాంలో అమలు చేసిన అరకొర పథకాలు సైతం అందాలంటే జన్మభూమి కమిటీలకు, మధ్యవర్తులకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేసి నీతివంతమైన, పారదర్శక పాలన అందిస్తోంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యం. ఆ దిశగా దాదాపు నాలుగేళ్లుగా సమర్థవంతమైన పాలన చేస్తున్నారు. వీటిన్నింటిని ప్రజల ముందుకు తీసుకెళ్లి, మద్దతు కూడగట్టేందుకు, ప్రజామోదం పొందేందుకు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం పేరుతో ప్రతిష్టాత్మక ప్రచార కార్యక్రమాన్ని నేటి నుంచి ప్రారంభిస్తోంది. 'మా నమ్మకం నువ్వే జగన్' అనే ప్రజల నినాదంతో కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత కార్యక్రమంగా నిర్వహించనుంది.

- దాదాపు 14రోజుల పాటు పార్టీ నాయకులతో పాటు కొత్తగా నియమించిన గృహ సారథులు, సచివాలయం, వార్డు సచివాలయం కన్వీనర్లు ఇంటింటికీ వెళ్తారు.
- మద్దతు తెలిపిన వారిరి డోర్, మొబైల్‌కు స్టిక్కర్లు అతికిస్తారు.
- 8296082960 నంబర్‌కి మిస్డ్‌కాల్ చేసి మద్దతు తెలపాలని కోరుతారు.
- నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన తీరును, పేద విద్యార్థులకు డిజిటల్ క్లాస్ రూమ్‌లు, అధునాతన ట్యాబ్‌లు, మెరుగైన టాయిలెట్లు వంటి సౌకర్యాలు, అందుబాటులోకి తెచ్చిన ఇంగ్లిష్ మీడియం చదువులు వంటి వాటిపై ప్రజలకు వివరిస్తారు.
- గత ప్రభుత్వం ఏం చేసిందో కూడా పోల్చి చూపిస్తారు. ఎస్సీ, ఎస్టీలకు ఈ ప్రభుత్వం ఏం చేసిందో...గత ప్రభుత్వం ఎలా మోసగించిందో తదితర వాటిని కూడా వివరిస్తారు.
- కరపత్రంలోని ప్రశ్నలను అడిగి ప్రత్యేక మైన పీపుల్స్ సర్వే నిర్వహించి, ప్రజలను వారి భవిష్యత్ కోసం సీఎం జగన్‌ను విశ్వసిస్తున్నారా అని అడగనున్నారు.
- ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే జిల్లా పార్టీ విస్తృత ఏర్పాట్లు చేసింది. కరపత్రాలను ఆవిష్కరించింది. గృహ సారథులతో సమావేశమై కార్యక్రమాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో అవగాహన కల్పించింది.

జిల్లాకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్

- తొలిరోజు 2,248 మంది రోగులకు మందులు పంపిణీ



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అరసవల్లి: అద్భుతమైన ఆరోగ్య పథకానికి వైద్యాధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తి స్థాయిలో గురువారం ప్రారంభించడంతో గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. మొత్తం 30 మండలాల్లోనూ మొబైల్ మెడికల్ యూనిట్ (104) వాహనాల సేవలు గ్రామీణ ప్రజలకు అందించారు. అలాగే డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీతులసిల ఆధ్వర్యంలో పీహెచ్‌సీల విధుల్లో ఉన్న 132 మంది వైద్యులు ట్రయల్ రన్ అనుభవంతో తొలిరోజున ఈ విధానాన్ని రెగ్యులర్ చేశారు. ఉదయం 9 గంటల నుంచి ఓపీ విభాగాన్ని ప్రారంభించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామాల్లో ఇంటిలో మంచానికే పరిమితమైన రోగులను నేరుగా వెళ్లి పరామర్శించారు. మందుల వాడకాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించిన అనంతరం జిల్లాలో ప్రధాన కార్యక్రమంగా ఆమదాలవలస మండలం కణుగులవలసలో అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఈ విధానాన్ని ప్రారంభించారు. అలాగే పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలం మబుగాంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, టెక్కలి మండలం లింగాలవలసలో జెడ్పీటీసీ దువ్వాడ వాణి ప్రారంభించారు. అలాగే పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతితో పాటు మిగిలిన నియోజకవర్గాలు, మండలాల్లో ఆయా మండల ఎంపీపీలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ లక్ష్మీతులసి మాట్లాడుతూ జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం విజయవంతంగా ప్రారంభమైందని, ఒక్క రోజులో 30 మండలాల్లో 66 పీహెచ్‌సీల పరిధిలో 2,248 మంది రోగులు ఓపీ సేవలను వినియోగించుకున్నారని, వీరికి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లుగా వివరించారు. ఇక ప్రతి నెలా రెండు సార్లు ప్రతి గ్రామానికి ఈ ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ ప్రత్యక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



పోలాకి: ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

104 వాహనాన్ని నడిపిన మంత్రి

కాశీబుగ్గ: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఫ్యామిలీ డాక్టర్‌తో కలిసి 104 వాహనాన్ని నడిపారు. పలాస మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని దేశమంతా మెచ్చుకుంటోందని, ఆయుష్మాన్ భారత్ పేరుతో దేశ ప్రజలకు చేరవవుతోందని అన్నారు.



104 వాహనాన్ని నడుపుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

14 రకాల టెస్ట్‌లు, 105 రకాల మందులు

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో 14 రకాల టెస్ట్‌లు, 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. ఈ కార్యక్రమం కోసం నాలుగేళ్లలో 49 వేల మంది వైద్య సిబ్బందిని నియమించారు. నెలకు రెండు సార్లు ఆయా విలేజ్ క్లినిక్‌ల పరిధిలో మొబైల్ మెడికల్ యూనిట్ పర్యటిస్తుంది.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

ప్రజలకు మెరుగైన వైద్యం

గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగపడుతుంది. రెండు వేల జనాభాకు ఓ ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని నియమించడం వల్ల పేద ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందుతాయి.

– శ్రీకేష్ బి.లాఠకర్, కలెక్టర్

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత

శ్రీకాకుళం రూరల్: అలికాం వద్ద అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఆమదాలవలసకు చెందిన పొట్నూరు అనంతరావు నరసన్నపేటకు 20 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు విచారణలో గుర్తించారు. వీటి విలువ రూ.40 వేలు ఉంటుందని అంచనా వేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ బి.రామారావు, సివిల్ సప్లయ్ డీటీ షరీఫ్, హెచ్‌సీ కె.అప్పన్న, శేషగిరి పాల్గొన్నారు.

సందడిగా సెంచూరియన్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ సుప్రియ పట్నాయక్

పర్లాకిమిడి: పట్టణంలోని సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో వార్షికోవాలు గురువారం సందడిగా సాగాయి. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయక్(భువనేశ్వర్) ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాలను ప్రారంభించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రొ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సెంచూరియన్ విద్యార్థులు 10, ప్లస్2 సీబీఎస్‌ఈఓలో ఉన్నత ర్యాంకులు సాధించారని, ఇదే స్ఫూర్తితో ప్రస్తుతం విద్య అభ్యసిస్తున్న వారు కూడా రాణించాలని సూచించారు.

పాడి పరిశ్రమకు అండగా..

- ఆడదూడల ఉత్పత్తి పథకానికి సర్కార్ శ్రీకారం



మేలు జాతి రకాల దూడలను ప్రదర్శిస్తున్న రైతులు

జలుమూరు: రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు. రైతును రాజుగా మార్చేందుకు రాయితీలపై వ్యవసాయం అనుబంధ సంస్థ అయిన పాడి పరిశ్రమకు ఇప్పటికే చేయూతనిస్తూ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఆడ దూడల ఉత్పత్తి పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా లింగనిర్ధారిత ఆధారంగా ఆవులకు 90 శాతం మేలు రకాల ఆడ దూడలు పుట్టేలా పశువైద్య అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లా వ్యాప్తంగా మేలు రకాల ఆడదూడలు ఒక్క రోజు నుంచి ఆరునెలలు వయస్సు ఉన్నవి ప్రస్తుతం సుమారు 97 వేలు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ అంచనా. అయితే ఎంపిక చేసిన రకాలైన ముర్రా, జెర్సీ, హెచ్, ఎఫ్, గిర్, సాహివాల్ తదితర రకాల ఆడదూడలను రెట్టింపు చేసేలా అధికారులు దృష్టి సారించారు.

2850 డోసులు లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా మేలు రకాల ఆడదూడల ఉత్పత్తి కోసం వినియోగించే కృత్రిమ గర్భాధారణ వీర్యం ఇంజక్షన్ల (సెక్స్ సార్టెడ్ సెమెన్) డోసేల లక్ష్యం 2,850 కాగా ఇప్పటికే సుమారు 40 గ్రామాల్లో 586 డోసులు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది నవంబర్‌లో ప్రారంభమైన ఈ పథకం ఇప్పుడిప్పుడే బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. సుమారు వంద గ్రామాల్లో కృత్రిమ గర్భాధారణలు చేసేందుకు వంది మంది పశువైద్యులు పర్యవేక్షిస్తున్నారు.

పథకం ఉద్దేశం..

ఎంపిక చేసిన గ్రామాల్లో మేలుజాతి ఆవుల లింగనిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా ఆడదూడలు ఎక్కువ ఉత్పత్తి చేసి తద్వారా పాల దిగుబడిని పెంచడమే ఈ పథకం ఉద్దేశం.

లక్ష్యం..

- లింగనిర్ధారిత వీర్యం ఉపయోగించడం ద్వారా రైతులకు కావల్సిన మేలైన దూడలను 90 శాతం కచ్చితత్వంతో పుట్టించి పాలదిగుబడి పెంచడం, వాటి ద్వారా రైతులకు ఆదాయం పెంచడం
- తక్కువ సమయంలో ఎక్కువ మేలుజాతి ఆడదూడలను పుట్టించి మారుమూల గ్రామాల్లో సైతం మేలు జాతి పశుసంపదను త్వరితిగతిన అభివృద్ధి చేయడం
- లింగ నిర్ధారిత వీర్యం, సాంకేతికతను రైతుల వద్దకు చేర్చడం, రాయితీని అందుబాటులో ఉంచడం

రాయితీ ఇలా..

ఆడ దూడల పథకం ద్వారా ఒక్కో కృత్రిమ గర్భధారణ వీర్యాన్ని 675 రూపాయలకు అందజేస్తారు. రెండుసార్లు ఇంజక్షన్ ద్వారా వీర్యాన్ని ఎక్కించాల్సి ఉంటుంది. దీనికి రూ.1350 చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం రూ.500 రాయితీ ఇస్తోంది. దీంతో రైతు రూ.850 చెల్లిస్తే సరిపోతుంది.

పాడి రైతుకు ఉపయోగకరం



ఆడదూడల పెంపకం పథకం పాడి రైతులకు ఎంతో ఉపయోగకరం. పాడి ఉత్పత్తిదారులు, రైతులు, మహిళా సంఘాలు, ఎన్జీవోలు, ఇతర రైతు సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా పాడి పరిశ్రమతోపాటు పాల ఉత్పత్తిని పెంచి లాభపడాలి.

– కిశోర్, జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు

జూలై 31 వరకూ ఉచిత సేవలు



పాడి పరిశ్రమతోపాటు పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం వినూత్నంగా ఉచిత కృత్రిమ గర్భధారణలు చేయిస్తోంది. మేలు రకాలైన ఆడదూడల ఉత్పత్తికి సంబంధించి ఏప్రిల్ నుంచి జూలై 31వ తేదీ వరకూ ఎంపిక చేసిన గ్రామాల్లో పశు సిబ్బంది ఉచితంగా పశువులకు ఇంజక్షన్‌లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శివ్వాల మన్మథరావు, డీడీ, జిల్లా పశుగణాభివృద్ధిశాఖ, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా

ప్రసూతి సిబ్బంది నిర్లక్ష్యంపై విచారణ



విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్

టెక్కలి: ఈ నెల 2న అర్ధరాత్రి సమయంలో మందస మండలం హంన్నాలి గ్రామానికి చెందిన గర్భిణికి టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేసే విషయంలో ప్రసూతి విభాగానికి చెందిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనపై గురువారం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ అంబరీష్ నేతృత్వంలో డీసీహెచ్‌ఎస్ భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మీ తులసీ, సూపరింటెండెంట్ సూర్యారావు, ప్రసూతి వైద్యులు ధనలక్ష్మి, జ్ఞానప్రసూన, ఈఎన్‌టీ శ్రీరాములు, మేటీ అసిస్టెంట్ పాపమ్మతో పాటు సంఘటన జరిగిన రోజున విధుల్లో ఉన్న మొత్తం సిబ్బంది, హరిపురం పీహెచ్‌సీ పరిధిలోని వైద్యుడు, సంఘటన రోజున గర్భిణితో వచ్చిన ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, ప్రసవం చేసిన 108 సిబ్బంది, బాధితురాలు దేవకినాయక్ కుటుంబసభ్యులను సుదీర్ఘంగా విచారించారు. ప్రసవం చేసే విషయంలో మేటీ అసిస్టెంట్ పాపమ్మ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు చివరగా నిర్ధారణ జరిగింది. దీంతో ఆమెపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ సిఫారసు చేశారు. ఈ ఘటనపై కలెక్టర్‌కు పూర్తి వివరాలతో నివేదిక అందజేస్తామన్నారు.

ఆన్‌లైన్‌లో ఫీవర్ కేసుల నమోదు

- ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు డీఎంహెచ్‌ఓ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: జిల్లాలో జ్వరాల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్ని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ఫీవర్ కేసుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి ఆదేశించారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధుల కేసులను ప్రభుత్వ వైద్యశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల వారీగా నమోదవుతున్న కేసుల వివరాలను ప్రతినెలా 28వ తేదిలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అడిషినల్ డీఎంహెచ్‌ఓ అనూరాధ మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ చట్టం ఫారం-ఎఫ్‌ను ఈ నెల 25లోగా డీఎంహెచ్‌వో కార్యాలయానికి పంపించాలన్నారు. ఐటీ మేనేజర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫీవర్ కేసుల వివరాలను ఫారం-పి, ఫారం-ఐలో నమోదు చేయాలని, ఎలాంటి సందేహాలున్నా 8639074149, 9491764543 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు డాక్టర్లు అమ్మన్నాయుడు, చంద్రానాయక్, మందుల మోహనరావు, తిరుపతిరావు, డీఐఓ ఆర్‌వీఎస్.కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రికెట్ పోటీల విజేత మందస జట్టుకు కప్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

మందస: యువత నేరాలకు దూరంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జరిగిన ఎస్పీ కప్-2023 పోటీలు ముగింపు సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. చిన్నప్పటి నుంచే క్రీడలను కూడా విద్యలో భాగంగా చేసుకోవాలని, దీంతో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం పలాస నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు, క్రీడాపరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన థింసా, కూచిపూడి, జాతీయ సమగ్రతను చాటిచెప్పే నాట్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్పీ రాధిక సాధించిన విజయాలతో కూడిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమాలను ఘనంగా నిర్వహించిన ఎస్‌ఐ ఎస్.రవికుమార్‌ను ఎస్పీ అభినందించారు. పవన్ పుత్రసేవాసంస్థ, స్పందన, సాంస్కృతిక వేదికతోపాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానికులు సేవలందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, డీఎస్పీ ఎం.శివరామిరెడ్డి, ఎస్పీఎక్స్ సీఐ ఎం.శ్రీనివాసరావు, పలాస సీఐ జి.శంకరరావు, వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ వై.మధుసూదనరావు పాల్గొన్నారు.

10న బీఈడీ మిగులు సీట్ల భర్తీ

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 10న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏయూ ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల, ఐఏఎస్ఈలో కొన్ని సీట్లు మిగిలాయని, వీటిని ఎడ్‌సెట్ 2022లో అర్హత సాధించిన వారితో స్పాట్ అడ్మిషన్ల విధానంలో భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఖాళీల వివరాలు www.audoa.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు నేరుగా తమ విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లు, ఎడ్‌సెట్ ర్యాంక్ కార్డులతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

APSRTC
SHORT TENDER NOTICE

Tenders are invited through ONLINE ("www.tender.apeprocurement.gov.in") for 1) Construction of compound wall for passage to vacant site of OS 15 in Bus Depot at Tekkali, Srikakulam District, 2) Providing Compound wall to vacant site of OS 15 in Bus Depot Paderu, ASR District. For full Tender Notice please visit "www.apsrtc.ap.gov.in". For Online participation please visit "https://tender.apeprocurement.gov.in". Note : Bid Document download Start Date & Time : 17-04-2023, 4.00 PM, Bid Submission Closing Date & Time : 24-04-2023, 4.00 PM. Further details : Ph.Nos: 9704544452, 9959224886 (10.00 AM to 5.30 PM).

NIT No.01/CCE/APSRTC/2023-24, Dt.06.04.2023 — Chief Civil Engineer, APSRTC, Vijayawada

P.B.DEVI COLLEGE OF EDUCATION
Ijjavaram, Santhabommali Mandal, SKLM Dist.
Email: pbdevibed@gmail.com. Cell : 7989186128, 9490497803
B.Ed., ADMISSION NOTIFICATION for category-A (Spot) Seats for the academic year 2022-2024

No. APEdCET-2022/SPOT ADMNS/CAT-A/1 Quota, Dated 03.04.2023.

Applications are invited from eligible candidates of Edcet-2022 qualified rank holders and non Edcet candidates seeking admissions into two years B.Ed course for the academic year 2022-24. Applications can be obtained from the college website www.mahakavisrisripbd.com or office in person or by post. Candidates shallnot be allowed for spot admission without original certificates.

Filled in applications along with the original certificates and xerox copies should be submit in college office from 08.4.2023 to 10.4.2023.

Publishing of List of Candidates 10.04.2023.
Uploading of Candidates particulars 11.04.2023 to 14.04.2023.

Secreatary & Correspondent — Principal

HARAGOPAL COLLEGE OF EDUCATION
Polaki village & Mandal, Srikakulam Dist.
Email: haragopalcollege@gmail.com Cell :9246628473 & 8106030880
B.Ed., ADMISSION NOTIFICATION for category-A (Spot) Seats for the academic year 2022-2024

No. APEdCET-2022/SPOT ADMNS/CAT-A/1 Quota, Dated 03.04.2023.

Applications are invited from elegible candidates of Edcet-2022 qualified rank holders and non Edcet candidates seeking admissions into two years B.Ed course for the academic year 2022-24. Candidates shallnot be allowed for spot admission without original certificates.

Filled in applications along with the original certificates and xerox copies should be submit in college office from 08.4.2023 to 10.4.2023.

Publishing of List of Candidates 10.04.2023.
Uploading of Candidates particulars 11.04.2023 to 14.04.2023.

Secreatary & Correspondent — Principal

VAMSADHARA COLLEGE OF EDUCATION
Kotabommali, Srikakulam Dist.
Email: vamsadharaeducation@gmail.com Cell: 9440836205, 9398138875.
B.Ed ADMISSION NOTIFICATION for category - A (Spot) & Category - B (Management) Seats for the academic year 2022-2024

No. APEdCET-2022/SPOT ADMNS/CAT-A/1 Quota, Dated 03.04.2023.

Applications are invited from eligible candidates of Edcet - 2022 qualified rank holders and non Edcet candidates seeking admissions into two years B.Ed course for the academic year 2022-2024. Applications can be obtained from the college website www.vamsadharacoe.org.in or office in person or by post. Candidates shall not be allowed for spot admission without original certificates.

Filled in applications along with the original certificates and Xerox copies should be submit in college office from 08.04.2023 to 10.04.2023.

Publishing of List of Candidates 10.04.2023.
Uploading of Candidates particulars 11.04.2023 to 14.04.2023.

Secretary & Correspondent — Principal

10న అప్రెంటీస్ మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఈ నెల 10న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. ఎచ్చెర్ల ఐటీఐలో గురువారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన మేదా సర్వో ప్రైవేట్ లిమిటెడ్, అక్షయ సోలార్ సిస్టమ్స్, స్థానిక పరిశ్రమలైన యునైటెడ్ బ్రూవరీస్, రెడ్డీస్ ల్యాబ్స్, శ్యాంక్రగ్ పిస్టన్స్, ఆంధ్రాఆర్గానిక్స్ పరిశ్రమల ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రానిక్స్ మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానికల్ ట్రేడుల్లో చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో 10వ తేదీన ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. హెచ్‌టీటీపీఎస్://డీజీఈటీ.జీవోవీ.ఇన్//ఏపీపీ మేళా/2022లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9128767345, 9849988879 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఇచ్ఛాపురం రూరల్: తనను కులం పేరుతో దూషించారని కొఠారీ గ్రామానికి చెందిన డోపా సులోచన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈదుపురం గ్రామానికి చెందిన ఏడుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. తన భూమిని ఈదుపురం గ్రామానికి చెందిన ఎస్.రామకృష్ణ, బి.చెల్లయ్య, ఎ.శ్యామ్‌సుందరరావు, బి.అప్పారావు, బి.హేమారెడ్డి, ఎ.వాసుదేవరావు, తరుణ్ బెహరాలు ఆక్రమించుకున్నారని, తన భూమి ఇవ్వాలని కోరగా, కులం పేరుతో దూషించారంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, ఖాళీస్థలం పన్నులు ఈ నెలాఖరులోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పన్నులను వ్యయ ప్రయాసలకు ఓర్చి కార్పొరేషన్ కార్యాలయంలోనే కట్టాల్సిన పనిలేదని, సమీప సచివాలయంలోనూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



నైరా విద్యార్థులు ఏర్పాటు చేసిన రైతు ప్రదర్శనను తిలకిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

కోటబొమ్మాళి: వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆధునిక పద్ధతులతో సేద్యం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని నైరా-కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అన్నారు. గురువారం కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడులో నైరా కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు వ్యవసాయ ప్రదర్శనను ఏర్పాటుచేసి ఆధునిక సేద్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనకాపల్లి పరిశోధన కేంద్రం సహాయకులు డా.పి.వి.కె.జగన్నాథం మాట్లాడుతూ రైతులు యాంత్రీకరణ ద్వారా వ్యవసాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నైరా శాస్త్రవేత్తలు డి.శ్రీనివాస్, హరికుమార్, నీలవేణి, సమన్వయకర్తలు డాక్టర్ జి.ఎస్.రాయ్, కె.భాగ్యలక్ష్మి, టెక్కలి ఏడీ బి.వి. తిరుమలరావు, కోటబొమ్మాళి ఏఓ గోవిందరావు, జిల్లా సలహామండలి చైర్మన్ డాక్టర్ శిమ్మ నేతాజీ, సర్పంచ్ తలగాన గణపతిరావు, ఎంపీటీసీ సింగూరు కల్యాణి పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఢిల్లీలో దుండగుల చేతిలో మృతి చెందిన న్యాయవాది కుటుంబానికి మద్దతుగా గురువారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. తొలుత జిల్లా కోర్టు నుంచి కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, బార్ ప్రతినిధులు చిన్నారావు, మామిడి క్రాంతి, కూన అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మదీనాబాబా చందనోత్సవానికి వేళాయె..!

- హిందూ-ముస్లిం సమైక్యతకు చిహ్నంగా కళింగపట్నం మదీనా దర్గా
- ముమ్మరంగా ఏర్పాట్లు



కళింగపట్నంలో దర్గా ఎదురుగా ఉన్న ప్రార్థనా మందిరం



మదీనాబాబా సమాధి

గార: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే కళింగపట్నం మదీనా దర్గా ఉర్సు ఉత్సవం (చందనోత్సవం) శనివారం నిర్వహించనున్నారు. ఏటా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొనే ఉరుసు ఉత్సవం రంజాన్‌లో నెలవంక ప్రారంభం నుంచి 16వ రోజున జరుపుతారు. ఈ ఏడాది శుక్రవారం ప్రారంభించి ఆదివారంతో ముగియనుందని హజరత్ కళింగ మదీనాబాబా దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ దర్గాకు ఉత్తరాంధ్ర నుంచి ముస్లింలతో పాటు హిందూ భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. 11వ శతాబ్దంలో పవిత్ర మక్కా నగరం నుంచి మదీనా బాబా ఇక్కడికి వచ్చినట్టు తెలుస్తోంది. ఆ తరువాత రోజుల్లో ఇక్కడే జీవసమాధి పొందారు. హిందూ ముస్లింల సమైక్యతకు వారధిగా నిలుస్తోంది ఈ మదీనా దర్గా. ప్రతీ రోజు ముస్లింలు ఇక్కడ నమాజ్ చేస్తుంటారు. ప్రతి గురువారం అధిక సంఖ్యలో హిందువులు తరలివచ్చి దర్గా వెనుక ఉన్న స్తంభం వద్ద అగరుబత్తీలు వెలిగించి పూజలు చేస్తుంటారు. విలువైన వస్తువులు పోగొట్టుకున్న సమయాల్లో బాబాకు మొక్కుకుంటే అవి దొరకుతాయని భక్తుల్లో బలమైన నమ్మకం. ఆ వస్తువులు దొరికిన తర్వాత అటుకులు ప్రసాదాన్ని చిన్నారులకు పంచడం ఆనవాయితీగా వస్తోంది.


కార్యక్రమాలు ఇలా..

- శుక్రవారం గౌస్‌పాక్ జెండా ఆవిష్కరణ, ఖురాన్ పఠనం, అన్నదానం
- శనివారం ఉదయం 5 గంటల నుంచి ముజావరుల సన్నిధిలో బాబాగుసూల్ (సమాధి శుద్ధి) నిర్వహిస్తారు. 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు నిజరూప దర్శనం, ఖురాన్ పఠనం
- సాయంత్రం 4 గంటల నుంచి బాబా చాదర్, చందనం ఊరేగింపు, అనంతరం సమాధిపై చాదర్ కప్పుతారు.
- ఆదివారం ఉపవాస దీక్ష విరమణ

గంజాయి, నల్లమందు పట్టివేత

కోటబొమ్మాళి: పెద్దబమ్మిడి, ఎత్తురాళ్లపాడు గ్రామాల మధ్య గంజాయి, నల్లమందు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసు లు అదుపులోకి తీసుకున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య జాతీయ రహ దారి పక్కన కిరాణా షాపులో గంజాయి, నల్లమందు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు కోటబొమ్మాళి పోలీసులు గురువారం దాడి చేయగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి గంజాయి, నల్లమందును స్వాధీనం చేసుకున్నట్లు కోటబొమ్మాళి ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ డి.ప్రభాకరరావు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

60 ఎకరాల్లో పలాసలో కొత్త పారిశ్రామికవాడ



మాట్లాడుతున్న పలాస జీడి పారిశ్రామిక వేత్తలు

కాశీబుగ్గ: పలాస జీడి పరిశ్రమలకు తోడ్పాటు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిందని, దీనిలో భాగంగా రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో 60 ఎకరాలలో మరో పారిశ్రామికవాడ ఏర్పాటుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగీకారం తెలియజేయడం సంతోషంగా ఉందని పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్ అన్నారు. గురువారం పలాసలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018లో తిత్లీ తుఫాన్ సమయంలో పరిశ్రమలు దెబ్బతిన్నా, జీడిపిక్కలు తడిసి ముద్దయినా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదని గుర్తు చేశారు. సకాలంలో విద్యుత్ రాక పరిశ్రమలు మూతపడటంతో నిరసన తెలిపిన వ్యాపారులకు తిరిగి బెదిరింపులకు గురిచేశారన్నారు. టీడీపీ యేతర వ్యాపారులపై ఇన్‌కం టాక్స్ దాడులు జరిగేవని, నూతన యంత్రాలు తీసుకుని వస్తే రూ.25 లక్షల వరకు జరిమానాలు విధించేవారని గుర్తు చేశారు. కరోనా సమయంలో దేశమంతా పరిశ్రమలు మూతపడితే పలాసలో మాత్రం కొనసాగాయని చెప్పారు. కొత్త పారిశ్రామికవాడ ఏర్పాటుతో సుమారు 20 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. సమావేశంలో పలాస ఇండస్ట్రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరం, ఏఎంసీ అధ్యక్షుడు పి.వి.సతీష్, తూముల శ్రీనివసరావు, పట్నాన రవికాంత్, కె.వి.శివకృష్ణ, శాశనపురి శ్రీనివాసరావు, సనపల సింహాచలం పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	59,670-00
బంగారం(22కి. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	76,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹ 206



సాక్షి క్లాసిఫైడ్స్

COACHING CENTER
EAMCET, I-CET, POLYCET, APRJC & For ALL COMPETITIVE Exams. New Batches Available. SURYA ACADEMY, Kota Jn., Vizianagaram. Ph : 99490 03295 [V- 6107]

REAL ESTATE
శ్రీకాకుళం, విశాఖపట్నంలలో అతి తక్కువ ధరలలో ఇండిపెండెంట్ హౌసులు, ఫ్లాట్స్, గ్రూపు హౌసులు లోను సౌకర్యముతో లభించును సంప్రదించండి. సెల్: 9493086239 [S-756389]

WANTED
Agent Recruitment SBI LIFE INSURANCE Opp: M.R.O. Office, Main Road, Narasannapeta. Qualification: 10th. Contact: 9014530090 [S-756391]

మీ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం. మరిన్ని వివరాలకై. Cont: 8019995348 [G-1152531]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-1152530]

మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact : Mega Group Man Power & Security. Cell : 70326 10569, 70931 25169. [NA 5483]

VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను. ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, RMP, Dr., Q: 5th - డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995984445 [H-16]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీతం: 16k - 18k ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899 [HA-1164]

గుంటూరు నందు చికెన్ షాపులో అనుభవం గల కట్టింగ్ డ్రస్సింగ్ వచ్చిన వారు అర్జంట్‌గా కావలెను. జీతం: 15,000/-రూమ్+భోజనం ఫ్రీ. సంప్ర: 9553715528, 8142311488 [G-795443]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.